క్లుప్తంగా

రహదారిపై పొంగుతున్న మురుగు!



తెనాలి అర్బన్: మారీసుపేట రేపల్లె గేటు సమీపంలోని రైతు బజారు వద్ద మురుగు కాలువలు పొంగుతున్నాయి. కాలువలు పారుదల లేకపోవడంతో మురుగు రోడ్లపైకి చేరుతోంది. దీంతో రాకపోకలు సాగించే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. శుక్రవారం రాత్రి కూడా ఇదే పరిస్థితి నెలకొనడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు కాలువల్లో పేరుకు పోయిన వ్యర్థాలను తొలగించాలని.. మురుగు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

డ్రెయిన్ల నిర్మాణ పనులు పరిశీలన



తెనాలి టౌన్: రూరల్ మండల గ్రామం కొలకలూరులో మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణ పనులను 'డ్వామా' ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ శుక్రవారం పరిశీలించారు. తొలిసారిగా నిర్మించే ఈ మ్యాజిక్ డ్రెయిన్ల కారణంగా మురుగు ఎప్పటికప్పుడు భూమిలోకి ఇంకుతుందని ఆయన చెప్పారు. నేల నీటిని త్వరితగతిన గ్రహించే అవకాశం ఉందన్నారు. ఫలితంగా దోమల వ్యాప్తికి ఆస్కారం ఉండదన్నారు. సిమెంటు కాలువలతో పోలిస్తే వీటి నిర్మాణ వ్యయం తక్కువగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇందుకు పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ముందుగానే గ్రామంలో పర్యటించి తగిన ఆదేశాలు జారీ చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్, ఇన్‌చార్జి గ్రామ పంచాయతీ కార్యదర్శి కరిముల్లా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాలు కాలువలో వేయరాదు



తెనాలి అర్బన్: కాలువల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. 19వ వార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లల్లో ఉత్పత్తయ్యే చెత్తను కార్మికులకు అందజేయాలని కోరారు. కాలువల్లో వ్యర్థాలను వేయడం వల్ల మురుగు పారుదల నిలచిపోయి ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు



తెనాలి: కూరగాయల మార్కెట్ యూత్ ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 70 కిలోల కేక్‌ను కట్ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో అడపాల కోటేశ్వరరావు, గుంటూరు రమేష్, తోటకూర వెంకట రమణారావు, గ్యాలం వేణు, హరిదాసు గౌరీశంకర్, దివ్వెల వెంకటేశ్వర్లు, కొసనా రాంబాబు, ఇస్మాయిల్, వేణు, అమ్మిశెట్టి హరి, కాలేషా, సురేష్ పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



దుగ్గిరాల: పద్మభూషణ్ జాషువా కళాపరిషత్ తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఈ నెల 24న(ఆదివారం) పౌరాణిక పద్య నాటకాలు, ఏకపాత్రాభినయం, కూచిపూడి నృత్యములను ప్రదర్శించనున్నారని పేద్దేటి యోహాను తెలిపారు. శుక్రవారం దుగ్గిరాల గుర్రం జాషువా విగ్రహం దగ్గర పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో షేక్ సుభాని, కె.నాగేశ్వరరావు, పి.సుమన్, ఎం.ఏసుపాదం జాషువా కళాపరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

చవితికి సిద్ధమవుతున్న గణనాథులు!

- వాడవాడలా నిర్మాణ దశలో పందిళ్లు
- తుది మెరుగుల్లో ఏకదంతుని విగ్రహాలు
- గతేడాది కంటే రెట్టింపు ధరలు

వినాయక చవితి సమీపిస్తోంది. తెనాలిలో చవితి పందిళ్లు కొలువుదీరుతున్నాయి. పట్టణ ప్రజలు గణనాథుని పూజలకు సన్నాహాలు చేస్తున్నారు. అవసరమైన గణపతి విగ్రహాలు వివిధ రూపాల్లో అందుబాటులోకి వచ్చేశాయి. అన్నింటి ధరలు పెరిగినట్టే గణపతి విగ్రహాల ధరలు కూడా హెచ్చుగానే ఉన్నాయి. అయినప్పటికీ శక్తి కొలదీ చవితి వేడుకల కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి.

తెనాలి: కరోనా విపత్కర పరిస్థితులు మినహాయింపు పట్టణంలో చవితి వేడుకలను అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరూ చవితి పందిళ్లను తమదైన వైవిధ్యం, విద్యుద్దీపాల అలంకరణతో భక్తులను ఆకర్షించేలా తీర్చిదిద్దుతున్నారు. పండుగ సమీపిస్తుండడంతో పట్టణంలోని సుల్తానాబాద్, అంగలకుదురు సమీపంలో వినాయక విగ్రహాలు అందుబాటులోకి వచ్చేశాయి. స్థానికంగానే పలువురు మట్టి గణపతి విగ్రహాలను తయారు చేస్తుంటే.. రాజస్తాన్‌కు చెందిన వర్కర్లు ప్రత్యేకంగా భారీ విగ్రహాలను చేస్తున్నారు. ఆ వర్కర్లు కుటుంబాలతో సహా ఇక్కడే ఉంటూ విగ్రహాలను తీర్చిదిద్దుతున్నారు. చవితి ఉత్సవాలకు ప్రసిద్ధి చెందిన మహారాష్ట్రలోని షోలాపూర్‌లో ఆర్డరుపై తయారు చేయించి తెప్పించిన విగ్రహాలను కూడా ఇక్కడే అమ్మకానికి సిద్ధం చేశారు.

అందుబాటులో 15 అడుగుల విగ్రహాలు..

1 అడుగు విగ్రహం నుంచి 15 అడుగుల భారీ విగ్రహాల వరకూ విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి.



విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

పర్యావరణ ప్రేమికుల కోసం మట్టి విగ్రహాలు కూడా ఇప్పుడు అందుబాటులో ఉంచుతున్నారు.

షోలాపూర్ నుంచి ఆకర్షణీయ విగ్రహాలు..



15 ఏళ్లగా గణపతి విగ్రహాల వ్యాపారం చేస్తున్నాం. మొదట నాలుగు అంగుళాల విగ్రహాలు షోలాపూర్‌లో ప్రత్యేకంగా చేయించి ఇక్కడ విక్రయించాం. నాలుగేళ్లగా 5 అడుగుల విగ్రహాలనూ చేయిస్తున్నాం. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని కేవలం వాటర్ కలర్స్‌నే వాడుతున్నాం. ప్రస్తుతం డిమాండ్ బాగానే ఉంది. పండుగ నాటికి అమ్మకాలు పుంజుకుంటాయని భావిస్తున్నాం.

దామెర్ల నాగేశ్వరరావు, చంద్రిక దంపతులు

పరిస్థితులకు తగినట్టే విగ్రహాల ధరలు కూడా భారీగా పెరిగాయి. గతంలో 1 అడుగు ఎత్తు ఉండే వినాయకుని విగ్రహం రూ.1,000 నుంచి రూ.1,500 ఉంటే ఇప్పుడు రూ.3,000 నుంచి రూ.3,500 పలుకుతోంది. 11, 12 అడుగుల భారీ విగ్రహాలను రూ.40 వేల నుంచి రూ.45 వేలకు అమ్మకాలు చేస్తున్నారు. ప్రస్తుతం అరకొరగా విగ్రహాల కొనుగోళ్లు జరుగుతున్నా, పండగ సమీపించే సమయానికి ముమ్మరం అవుతాయని నిర్వాహకులు చెబుతున్నారు.

మూడేళ్లుగా తెనాలికి వస్తున్నాం..

తమది రాజస్థాన్ అని.. 2008లో కోలకత్తాలో బంధువు దగ్గర విగ్రహాల తయారీ నేర్చుకున్నానని రాజస్థాన్ వర్కర్ జతారామ్ తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, లక్నోలో విగ్రహాలను చేస్తూ మెలకువలను నేర్చుకుని.. పాతిక మంది గ్రూపుగా గుంటూరు జిల్లాకు వచ్చారు. ఒక్కో పట్టణంలో దాదాపు నెలరోజుల చొప్పున నాలుగు నెలలు ఇదే పని నిర్వహిస్తారు. ముందుగా గణపతికి కొబ్బరి పీచు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో కావాల్సిన రూపునిచ్చి, తర్వాత మిగిలిన పనులు పూర్తిచేస్తారు. చవితి తర్వాత ఉత్తరప్రదేశ్ వెళ్లి దసరాకు దుర్గాదేవి విగ్రహాలు చేస్తారు. మిగిలిన సమయం సొంతూరులో వ్యవసాయ పనులు చేసుకుంటారు.



గణపతికి తుది మెరుగులు దిద్దుతున్న జతారామ్

పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి

తెనాలి టౌన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి ఆదేశించారు. రూరల్ మండలం కొలకలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. గర్భిణుల ఆరోగ్య పరీక్షలను పరిశీలించారు. వారితో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. కాన్పులన్నీ ఆరోగ్య కేంద్రంలోనే జరిగేలా సిబ్బంది శ్రద్ధ పెట్టాలని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తగిన సలహాలను ఇవ్వాలని చెప్పారు. ఈ సందర్భంగా రిటైర్డు జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ నరేంద్ర తన సొంత ఖర్చులతో 60 మంది గర్భిణులకు పౌష్టికాహార కిట్లను డాక్టర్ విజయలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వి.అన్నపూర్ణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు, డాక్టర్ యు.దిలీప్, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

వెనుదిరిగిన దివ్యాంగులు



ప్రశ్నిస్తున్న దివ్యాంగులు

తెనాలి అర్బన్: తెనాలిలోని సదరం క్యాంప్‌లో నెలకొన్న గందరగోళం శుక్రవారమూ తొలగలేదు. బాపట్ల రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆర్థోపెడిక్ విభాగానికి చెందిన దివ్యాంగులు కొందరు తెనాలి జిల్లా వైద్యశాలకు వచ్చి ఆ విభాగ క్యాంప్ జరగడం లేదని తెలియడంతో వారు కొద్దిసేపు ఆందోళన చేసి వెనుతిరిగారు. వివరాలలోకి వెళ్తే.. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు రీ వైద్య పరీక్షలు చేయించాలని భావించింది. దీనిలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో కొద్దినెలల క్రితం ఆర్థో, సైక్రాటిక్, ఈఎన్‌టీ, అప్తామాలజీ విభాగాల సదరం క్యాంప్‌ను నిర్వహించారు. ఆ సమయంలో హాజరుకాని బాపట్ల రెవెన్యూ డివిజన్ పరిధిలోని దివ్యాంగులను సచివాలయ ఉద్యోగులు గుర్తించి వారిని తెనాలిలోని సదరం క్యాంప్‌నకు పంపుతున్నారు. ఇక్కడ ఈఎన్‌టీ, సైక్రాటిక్ విభాగాల దివ్యాంగులకు వైద్య పరీక్షలు చేస్తూ వస్తున్నారు. చీరాలకు చెందిన ఈఎన్‌టీ వైద్యురాలు, నర్సారావుపేటకు చెందిన సైక్రాటిక్ వైద్యులు ఇక్కడ ప్రతిరోజు సేవలు అందిస్తున్నారు. శుక్రవారం రెండు విభాగాలతో పాటు ఆర్థోపెడిక్ విభాగానికి సంబంధించిన దివ్యాంగులు కొందర్ని సచివాలయ ఉద్యోగులు తెనాలి పంపారు. కానీ ఆ విభాగానికి సంబంధించిన క్యాంప్ జరగడంలేదని, వైద్యులను కూడా నియమించలేదని వారికి తెలియడంతో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి బాపట్ల డీఆర్‌డీఏ అధికారులతో మాట్లాడారు.

ఆలయాల్లో ఘనంగా శ్రావణ పూజలు



తెనాలి: శ్రావణ మాసం పురస్కరించుకుని చివరి శుక్రవారం దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా అమ్మవార్లకు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. దేవతా మూర్తులు విశేష అలంకారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. రామలింగేశ్వరపేటలోని శ్రీగంగాపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి 108 కలువలతో పూజా, ప్రత్యేక అలంకారం చేశారు. శ్రీఅష్టలక్ష్మి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మారీసుపేటలోని శ్రీ బాల త్రిపుర సుందరి సమేత శ్రీచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలోని అమ్మవారికి ఐశ్వర్య లక్ష్మి అలంకారం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దర్శించి తరించారు.

అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్(ఎంటీఎంసీ) పరిధిలోని అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 23వ తేదీలోపు అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనధికార లే అవుట్లలో 2025, జూన్ 30వ తేదీలోపు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు అర్హులని తెలిపారు. అనధికారికంగా విభజించిన లే అవుట్లలో కనీసం ఒక్క ప్లాటు అయిరా 2025, జూన్ 30 లోపు రిజిస్ట్రేషన్ జరిగి ఉండాలన్నారు. దస్తావేజులు, లింకు దస్తావేజులు కలిగి ఉండాలని, పూర్తి వివరాలకు ఎంటీఎంసీ కార్యాలయం మంగళగిరి, తాడేపల్లిలోని పట్టణ ప్రణాళికా విభాగాలలో సంప్రదించాలని తెలిపారు.

రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మంగళగిరి టౌన్: రైతులు రుణాలను సద్వినియోగం చేసుకుని పంట బాగా పండించాలని మంగళగిరి పీఏసీఎస్ చైర్మన్ గాదె పిచ్చిరెడ్డి అన్నారు. జీడీసీసీ బ్యాంక్ మంగళగిరి శాఖ కార్యాలయంలో శుక్రవారం రైతులకు రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా గాదె పిచ్చిరెడ్డి మాట్లాడుతూ రూ.41 లక్షల 21 వేలను రైతులకు రుణాలుగా అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు అందే శివశంకరరావు, వాసా వేణుకుమార్, ఇన్‌చార్జి సీవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పప్పు ధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన



శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ శేషుమాధవ్

మున్నంగి(తెనాలి): ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక 2025–26లో భాగంగా కొల్లిపర మండలం మున్నంగి గ్రామంలో శుక్రవారం రైతులకు పప్పు ధాన్యాల ప్రాముఖ్యత, సాగుపై అవగాహన సదస్సును నిర్వహించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్, కమర్షియల్ అగ్రికల్చర్(ఎన్‌ఐఆర్‌సీఏ), రాజమండ్రి ఆధ్వర్యంలో మున్నంగిలోని సెహమిత అగ్రి ప్రొడ్యూసర్ కంపెనీ ఫీల్డు ఆఫీసు ఆవరణలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎన్‌ఐఆర్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్ హాజరై, రోజువారి ఆహారంలో పప్పు ధాన్యాలకు గల ప్రాముఖ్యతను వివరించారు. సాగుకు కావాల్సిన శనగ విత్తనాలను రైతులకు ఉచితంగా అందజేశారు. అనంతరం గ్రామంలోని పసుపు పంటను పరిశీలించారు. ఎన్‌ఐఆర్‌సీఏ గుంటూరు శాస్త్రవేత్త డాక్టర్ వొల్లూరి వెంకటేశ్వర్లు ఆహారంలో పప్పు ధాన్యాల వినియోగంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సాంకేతిక అధికారి వేమూరి సుబ్బారావు, నీలగిరి ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ ఎ.రఘురామిరెడ్డి, గ్రామ ఉపసర్పంచి ఆళ్ల శివనాగిరెడ్డి, సెహమిత అగ్రి ప్రొడ్యూర్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ వంగా పరమేశ్వరరెడ్డి, అభ్యుదయ రైతులు ఎ.శంకరరెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

తెనాలి అర్బన్: దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ శాంత పేర్కొన్నారు. జేఎంజే కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీని శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దోమ కాటు వల్ల అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ రోజలిన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ దాసరి విజయలక్ష్మి, ఎన్‌సీసీ అధికారి ఎస్తేరురాణి, అధ్యాపకులు డాక్టర్ కె.అరుణ సుజాత, పీడీ డాక్టర్ జెన్నమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

వరద ఉధృతిని పరిశీలించిన మంత్రి మనోహర్

కొల్లిపర: కృష్ణా నదిలో నిలకడగా గత వారం రోజుల నుంచి కొనసాగుతున్న వరద ఉధృతిని శుక్రవారం మండల పరిధిలోని పాతబొమ్మువానిపాలెంలో తహసీల్దార్ జి.సిద్ధార్థ, తెనాలి హార్టికల్చర్ అధికారి తోటకూర శ్రీనిత్య, వివిధ శాఖల అధికారులతో కలిసి మంత్రి మనోహర్ పరిశీలించారు. వరద కారణంగా ఉద్యాన పంటలకు ఎంత మేరకు నష్టం జరిగింది అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక మెడికల్ క్యాంపును పరిశీలించి గ్రామంలోని ప్రజల ఆరోగ్య పరిస్థితులను సర్పంచి కొల్లి రజినిను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం నదిలో వరద 4.50 లక్షల క్యూసెక్కులు ప్రవహిస్తోందని, 24 గంటల్లో సుమారు 6 లక్షల క్యూసెక్కులకు వరద చేరే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.



పంటల నష్టం గురించి తెలుసుకుంటున్న మంత్రి మనోహర్

నష్టం జరిగిన రైతులకు వెంటనే ప్రభుత్వం నుంచి విత్తనాలు, ఎరువులు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవ్, వీఆర్‌వో రామరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థలో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

తెనాలి: న్యాయ వ్యవస్థలో ఓబీసీలకు రిజర్వేషన్లు నామమాత్రంగా అమలు చేయడాన్ని బీసీ న్యాయవాదులతో పాటు, మొత్తం బీసీ సమాజం నిరసిస్తోందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. మండల్ కమిషన్ సిఫార్సుల మేరకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని.. అయినా న్యాయవ్యవస్థలో రిజర్వేషన్లను సక్రమంగా అమలు చేయకపోవడం దారుణమని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలన్నీ కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉండి.. సమన్వయం, సమతౌల్యతలతో పనిచేయాల్సిన తరుణంలో ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు న్యాయ, శాసన వ్యవస్థలలోని ఉద్యోగాల్లోనూ తప్పనిసరిగా 27 శాతం రిజర్వేషన్లను అమలు జరపాల్సిందేనన్నారు. రాష్ట్ర స్థాయి న్యాయవ్యవస్థలో హైకోర్టు, జిల్లా కోర్టుల్లోని ఉద్యోగ నియామకాల్లో బీసీ న్యాయవాదులకు తగిన ప్రాధాన్యతను ఇవ్వడం లేదని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రైతులకు సరిపడా యూరియా అందించాలి

తెనాలి: రైతులకు సరిపడా యూరియాను ప్రభుత్వం అందజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. రూరల్ మండలంలోని తేలప్రోలు, కంచర్లపాలెం గ్రామాల్లోని పంటపొలాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు అడుసుమిల్లి పవన్, ఎర్ర నారాయణ తమ సమస్యలను తెలియజేశారు. రెండు సార్లు వెదపెట్టామని.. మూడోసారి ఇటీవలి భారీ వర్షానికి వరద ముంపునకు గురైందని చెప్పారు. వరి నారు కొనుగోలు చేసి నాటుకోవాలంటే రూ.13 వేలు అవుతుందని రైతులు తెలిపారు. శివసాంబిరెడి మాట్లాడుతూ.. ప్రభుత్వం కౌలు రైతులకు కూడా రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని గతేడాది వాగ్దానం చేసిందని గుర్తుచేశారు. అయినా గతేడాది సాయం ఇవ్వలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కౌలు రైతులకు మొండి చేయి చూపుతోందని.. అదే బాటలో రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోందని మండిపడ్డారు.



దెబ్బతిన్న పొలాలను పరిశీలిస్తున్న శివసాంబిరెడ్డి

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం చిర్రావూరు గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఏఐ-డీఎస్, సీఎస్సీ-2 విభాగాల వలంటీర్లు ఇంటింటికీ తిరిగి చెత్తను డ్రైనేజీలు, రోడ్లపై వేయరాదని సూచించారు. వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఏఐ-డీఎస్ విభాగాధిపతి డాక్టర్ వీఎస్‌వీ ప్రభాకర్ తెలియజేశారు. కాలువల్లో మురుగు పేరుకుపోవడం వలన దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశముందని సీఎస్సీ-3 విభాగాధిపతి డాక్టర్ ఎ.సింథెల్ వివరించారు. ప్రజలు దోమ తెరలను వాడాలని, మూడు రోజులకు మించి జ్వరం ఉంటే వైద్యులను సంప్రదించాలని అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఫీల్డ్ కో ఆర్డినేటర్ పి.సురేష్, వలంటీర్లను వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్ వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డీన్ డాక్టర్ హబీబుల్లా, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డిలు అభినందించారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

విద్యావేత్త శివరాంను ఆదర్శంగా తీసుకోవాలి

తాడేపల్లిరూరల్: ప్రముఖ విద్యావేత్త మంచిరెడ్డి శివరాం రెడ్డి (శివరాం)ను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని అరవింద హైస్కూల్ ప్రిన్సిపాల్ ఇంద్రాణి అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి అరవింద హైస్కూల్‌లో శుక్రవారం శివరాం విద్యాభివృద్ధికి చేసిన సేవలపై సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంద్రాణి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలన్నారు. ఆయన మృతి చెందినా శరీరాన్ని మెడికల్ కళాశాలకు ఇచ్చిన ధన్యజీవని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు అనూరాధ, పీఈటీ శ్రీనివాసరావు, మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి గాదె సుబ్బారెడ్డి, పాఠశాల సెక్రటరీ ఆదర్శ్, చైత్ర, ఉపాధ్యాయులు కొండా నాయక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా బాలాంజనేయ ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని శిరంగిపాలెం గ్రామంలో బాలాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే వేదపండితులు పవన్‌కుమార్, వినయ్ కుమార్‌లు ఆలయ ముఖ మండపంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, అఖండ పూజలు చేశారు. యాగశాలలో నవగ్రహ, విఘ్నేశ్వర హోమాలు నిర్వహించి భక్తులచే పూర్ణాహుతి గావించారు. బాలాంజనేయస్వామికి అర్చకులు ప్రసన్నమూర్తి పంచామృతాలతో అభిషేకాలు చేసి అష్టోత్తర, సహస్ర నామ పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కార్మికులకు బకాయిలను వెంటనే చెల్లించాలి



తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు బకాయిలను యాజమాన్యం వెంటనే చెల్లించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అన్నారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, ఎస్.సుబ్బారావులతో కలసి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుదీర్ఘకాలం యాజమాన్యం నిర్లక్ష్యానికి కార్మికులు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ఒక్కొక్కరుగా మృతి చెందుతున్నా పాలకవర్గ పార్టీలు స్పందించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా కార్మికులకు రావాల్సిన బకాయిలను యాజమాన్యం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లాజర్‌బాబు, పుష్పలీల, రిబ్కా, సువర్ణ, రమణమ్మ, ఖాసిం, ఇస్మాయిల్, రమాదేవి, దుర్గాభవాని, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.